# రాష్ట్రంలో 7.15 శాతం పెరిగిన నేరాలు

## డ్రగ్స్ కేసులు 46.10 శాతం పెరుగుదల

## టెక్నాలజీతో నేరాల నియంత్రణకు చర్యలు




**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మూడేళ్లలో నేరాల సంఖ్య 7.15 శాతం పెరిగిందని, ఇదే సమయంలో మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులు 46.10 శాతం పెరిగిందని డిజిపి సి.వి.ఆనంద్ తెలిపారు. టెక్నాలజిని మరింతగా వాడడం ద్వారా నేరాలను నియంత్రించే వీలుందని, ఇదే సమయంలో క్షేత్రస్థాయిలో పోలీసింగ్ బలంగా వుండడం అవసరమని ఆయన అన్నారు. డిజిపి కార్యాలయంలో శుక్రవార ం జరిగిన రాష్ట్ర అర్థ వార్షిక క్రైం రివ్యూలో డిజిపి ఆనంద్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పిలు, పోలీసు కమిషనర్లు పాల్గొన్న ఈ సమావేశంలో డిజిపి ఆయన మాట్లాడుతూ పోలీసులు వృత్తి నైపుణ్యతను మరింత పెంచుకోవాల్సిన అవసరం వుందని తెలిపారు. నేరాల సమీ క్షను కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ప్రతీ నేరం వెనుక వున్న కారణాలు, నేరస్తుల విధానాలు, దర్యాప్తు తీరు, కేసుల పరిష్కారం లోతుగా విశ్లేషించాలని ఆయన ఆదేశించారు. సిసిటిఎన్ఎస్పై అన్ని విభాగాల అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించడం వల్ల మెరుగైన ఫలి తాలు వచ్చాయని ఆయన తెలిపారు. గతంలో 70 నుంచి 80 ధాతం వరకు వున్న డేటా అప్డేట్ ఇప్పుడు 96 శాతం వరకు పెరగడం సంతో షించదగ్గ విషయమని ఆయన తెలిపారు. ప్రతీనెల నిర్వహించే క్రైం రివ్యూకు అన్ని యూనిట్ల అధికారులు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. క్షేత్రస్థాయి పోలీసింగ్ బలంగా వుండేందుకు యూనిట్ల అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. పోలీసు స్టేషన్లను క్రమం త ప్పకుండా తనిఖీ చేసి, అక్కడి పరిస్థితులను యూనిట్ల అధికారులు ఎప్పటికప్పుడు సరిదిద్దాలని డిజిపి ఆదేశించారు. రాష్ట్రంలో మూడేళ్ల కాలం లో 7.15 శాతం నేరాలు పెరగగా డ్రగ్స్ కేసులు 46.10 శాతం పెరిగిందని డిజిపి తెలిపారు. ఇదే సమయంలో తీవ్రమైన నేరాల సంఖ్య 10. 33 శాతం తగ్గడం మంచి పరిణామమని డిజిపి తెలిపారు. తీవ్రమైన నేరాలు తగ్గుతున్నా సాధారణ నేరాలు పెరుగుతున్నాయని, వీటి నివారణ కు సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో డ్రగ్స్ కేసులు సవాల్గా మారుతున్నాయని డిజిపి తెలిపారు. మూడేళ్ల వ్యవధిలో డ్ర గ్స్ కేసులు రాష్ట్ర వ్యాప్తంగా 46.10 శాతం పెరిగాయని ఆనంద్ తెలిపారు. వీటిని కట్టడి చేసేందుకు ఉమ్మడిగా కృషి చేయాలని ఆయన ఆదే శించారు. ఈ విషయంలో సాటి సర్కారీ విభాగాల సహాయం తీసుకోవాలని ఆయన కోరారు. మహిళలు, చిన్నారుల పట్ల జరిగే నేరాలు తగ్గాయని ఆయన తెలిపారు. ట్రాఫిక్ నేరాలు 9.48 శాతం పెరిగాయని డిజిపి తెలిపారు. సైబర్, ఆర్థిక నేరాలు కొంతమేర తగ్గాయని డిజిపి తెలిపారు. నెలవారి సమీక్షల వల్ల ఈ నేరాలు తగ్గాయని ఆయన అన్నారు. యువ పోలీసు అధికారు లు తమ వృత్తి నైపుణ్యతను నిరంతరం పెం చుకోవాలని డిజిపి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వుండే సిబ్బంది తో కలిసి నేరాలను కట్టడి చేయాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని ఆయన ఆదేశం చారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, సిటీ కొత్వాల్ సజ్జన్నర్, సిఐడి చీఫ్ చారు సిన్హా సహ ఇతర విభాగల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# తమిళనాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేల మధ్యన సిఎం విజయ్

### కొత్త సంప్రదాయానికి తెరలేపిన టివికె అధినేత

**చెన్నై, ఆగస్టు 28:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర అసెంబ్లీలో ఓ కొత్త సంప్రదాయానికి తెరలేపారు. శాసనసభలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పద్ధతికి భిన్నంగా, తన కోసం కేటాయించిన ప్రత్యేక కుర్చీని వీడి, మంత్రుల కోసం ఉన్న వరుసలో వారి పక్కనే కూర్చుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఘటన సభలో ఆసక్తికర చర్చకు దారితీసింది. సాధారణంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రికి స్పీకర్ కుర్చీకి దగ్గరగా, ప్రత్యేకమైన, విశాలమైన కుర్చీని కేటాయిస్తారు. మంత్రులు వారి సీనియారిటీ ప్రకారం సీఎం పక్కన మొదటి వరుసలో కూర్చుంటారు. వారికి ఎదురుగా ప్రతిపక్ష నేత, ఇతర శాసనసభాపక్ష నేతలు ఆసీనులవుతారు. ఇది ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం.బుధవారం మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీఎం విజయ్ అనూహ్యంగా తన కుర్చీ నుంచి లేచి, సభా నాయకుడైన మంత్రి కేఏ సెంగొట్టయాన్, మరో మంత్రి ఆదవ్ అర్జున మధ్యలో కూర్చున్నారు. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కొద్దిసేపు తమ సహచరులతో మాట్లాడేందుకు స్థానాలు మారడం సహజమే. ఒక ముఖ్యమంత్రి తన అధికారిక కుర్చీని వీడి మంత్రుల సీట్లో కూర్చోవడం ఇదే మొదటిసారని, గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇలా చేయలేదని సభా వర్గాలు చెబుతున్నాయి. అంతకుముందు సభలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల కార్యదర్శులు సభలో తప్పనిసరిగా ఉండేలా చూడాలని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పీకర్ను కోరారు. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో కరూర్ ఘటనపై చర్చ జరిగినప్పుడు అప్పటి సీఎం (ఎంకే స్టాలిన్), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు సభలోనే ఉన్నారు. కానీ ఇప్పుడు సీఎం, కార్యదర్శులు ఎవరూ సభలో లేరని ఆయన ప్రస్తావించారు. దీనిపై మంత్రి ఆదవ్ అర్జున స్పందిస్తూ, కార్యదర్శులు పక్కనే ఉన్న వార్ రూమ్ నుంచి సభ్యుల ప్రసంగాలను నోట్ చేసుకుంటున్నారని తెలిపారు. ఉదయనిధి వాదనతో స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ఏకీభవించారు. ఇకపై కీలక చర్చల సమయంలో సీనియర్ అధికారులు సభలో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం విజయ్ ఉదయం కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని, ఆ తర్వాతే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని తెలిసింది.

# చైనాలో 5.1 తీవ్రతతో భూకంపం




**బీజింగ్, ఆగస్టు 28:** చైనా నైరుతి ప్రాంతంలోని సిచువాన్ ప్రావిన్స్లో శుక్ర వారం 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. చైనా ఎర్త్క్వేక్ నెట్వర్క్స్ సెంటర్ ఈ విషయాన్ని వెల్లడించింది. నేపాల్చైనా సరిహద్దులో ఘోర వరదల నేపథ్యం లో హిమాలయ ప్రాంతం అప్రమత్తంగా ఉన్న సమయంలో ఈ భూకంపం సంభవించడం ఆందోళన కలిగిస్తోంది.సిచువాన్లోని లాంగ్చాంగ్ నగరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇది వరదల ప్రభావానికి గురైన నేపాల్టిబెట్ సరిహద్దు ప్రాంతాలకు వందల మైళ్ల దూరంలో ఉంది. భూకంపం కారణంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం లేదు.ఈ వారంలో ప్రారంభమైన భారీ ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో నేపాల్, టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విపత్తులో ఇప్పటికే వందలాది మంది ప్రాణా లు కోల్పోగా, మరో వందలాది మంది గల్లంత య్యారు. టిబెట్లో కొనసాగుతున్న సహా యక, సహాయ చర్యలపై చైనా అధ్యక్షుడు షీ జిన్పింగ్ శుక్రవారం ఉన్నతాధికారులతో సమా వేశం నిర్వహించారు. హిమనదాలు, మంచు సరస్సులు, భౌగోళిక విప త్తుల కారణంగా ప్రమాదం ఇంకా కొనసాగు తోందని అధికారులు హెచ్చరించారు. దీంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవు తున్నాయి. మరోవైపు, గతంలో వరదలు సంభ వించిన ప్రాంతంలో నీటిమట్టాలు పెరగడం తో నేపాల్ తాజాగా వరద హెచ్చరికలు జారీ చేసింది. ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు, సహాయక సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు సూచించారు.సరిహద్దు సమీ పంలో కొత్తగా ఏర్పడిన ఓ అవరోధ సరస్సు (బ్యారియర్ లేక్) గట్టు తెగిపోయే అవకాశం ఉం దని చైనా హెచ్చరించింది. అదే జరిగితే దిగువ ప్రాం తాల్లో మరిన్ని వరదలు సంభవించే ప్రమా దం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



డిజిపి ఆనంద్తో భేటీ అయిన ఐపిఎస్ హోదా అందుకున్న ఏడుగురు యువ ఐపిఎస్ అధికారులు

# డిజిపి ఆనంద్తో ఏడుగురు ఐపిఎస్ అధికారుల భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో దశాబ్దంన్నరకు పైగా పనిచేస్తూ నాన్ కేడర్ ఎస్పిలుగా వున్న ఏడుగురు అధి కారులకు కేంద్ర హోం శాఖ ఇటీవలే ఐపిఎస్ హోదా ఇవ్వడం తెలిసిందే. ఈ ఏడుగురు అధికారులు శుక్రవారం నాడు డిజిపి కార్యాలయంలో డిజిపి సి.వి ఆనంద్తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. డిజిపితో భేటీ అయిన వారిలో రవీందర్, వి. అరవింద్ బాబు, నాజ మహేంద్ర నాయక్, సాయిశ్రీ, పూజ, కరుణాకర్ వున్నారు. ఈ సందర్భంగా ఏడుగురు అధికారులను డిజిపి అభినం దించారు. భవిష్యత్తులో మరింత దీక్షతో పనిచేసి పోలీసు శాఖ పేరు ప్రతిష్టలు పెంచాలని ఆయన కోరారు.

# ఎపి మాజీమంత్రి అంబటి రాంబాబుకు అస్వస్థత

### హైదరాబాద్లోని అపోలో ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్స

### వైద్యపరీక్షల అనంతరం స్టెంట్ అమర్చిన డాక్టర్లు

### ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను హుటాహుటిన హైదరాబాద్లోని అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, రెండు స్టెంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాం బాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్కు తరలించారు. నగరంలోని హైదర్గూడలోని అపోలో ఆస్పత్రిలో చేరిన వెంటనే వైద్య బృందం ఆయనకు పలు వైద్యపరీక్షలు నిర్వ హించింది. యాంజియోగ్రామ్ చేసి, ఆయనకు స్టెంట్ వేయాలని నిర్ణయించారు. ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం అంబటి రాంబాబు వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నా రు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు వెల్లడించారు. ఈ వార్త తెలియగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు తీవ్రఆందోళనకు గురయ్యారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# యాంత్రీకరణ పనిముట్లు ఖరారు

### యూరియా సరఫరాల్లో ఇబ్బందులు లేవు

### కాంప్లెక్స్ ఎరువులకు సబ్సిడీ ఇవ్వాలి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** యాంత్రీకరణ పథకంలో పనిముట్లు ఖరారు చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా పనిముట్ల ఎంపిక చేసి, వాటి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హైదరాబాద్లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ యాంత్రీకరణకు అందించే సబ్సిడీని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. నాణ్యత, ధర తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంప్యానెల్ లిస్టును ఖరారు చేయాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ ద్వారా వచ్చే సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు యూరియాను సరఫరా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా 2.79 లక్షల టన్నులు, డీఏపీ 33 వేల టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2.25 లక్షల టన్నులు, ఎంఓపీ 31 వేల టనున్నులు, ఎస్ఎస్పీ 20 వేల టన్నులు అందుబాటులో ఉన్నా యని వివరించారు. ఆగస్టు సరఫరా ప్రణాళిక లో భాగంగా 1.50 లక్షల టన్నులకు గాను 1.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తెప్పించామన్నారు. కేంద్రం యూరియాకే కాకుండా కాంప్లెక్స్ ఎరువులకు కూడా సబ్సిడీ ఇవ్వాలని చెప్పారు. ఎరువుల ధరల విధానాన్ని సమతుల్యంగా రూపొందించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆయిల్పామ్ సాగు విస్తరణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని చెప్పారు. రైతుల్లో పెరుగుతున్న ఆసక్తికి అనుగుణంగా మొక్కల లభ్యతను పెంచడంతో పాటు, సకాలంలో మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీలకు భూమి అవసరమైతే ఇతర శాఖల ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయిల్పామ్ సాగులో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్ ఇరిగేషన్ కీలకమని, రైతులకు త్వరగా ఈ వ్యవస్థలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2600 రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ డాక్టర్ గోపి, కోఆపరేషన్ స్పెషల్ కమిషనర్ రాహుల్ రాజ్, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నిజామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్
(రాష్ట్ర చట్టం క్రింద స్థాపితమైన విశ్వవిద్యాలయం)
వార్తా పత్రికా ప్రకటన
ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్ఫారంపై బిడ్స్ ఆహ్వానిస్తోంది
(www.eprocurement.telangana.gov.in)
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ ప్రకటన
Ping/20/2024/TCU/వార్తా పత్రికలు తేది: 25.08.2026
NIMS కొరకు ఈ క్రింది సామగ్రి / అవసరమైనవి, వాటి నిమిత్తం ఇ-ప్రొక్యూర్మెంట్ పోర్టల్ https://eprocurement.telangana.gov.in ద్వారా బిడ్స్ కోరబడుతున్నవి. క్ర.సం. 1) ఫైల్ నంబర్ PingII/11/2024/ఏడు ఛానల్ మోనిటార్స్. పని పేరు: NIMS-ప్లానింగ్-మోనిటార్ల యొక్క సేకరణ-టెండర్ ప్రకటన జారీ చేయవలసి ఉంది.- వార్తా పత్రికలలో టెండర్ ప్రకటన ప్రచురణ నిమిత్తం అభ్యర్థన - గురించి. 2) ఫైల్ నంబర్ Ping I/07/2022/BMWM. పని పేరు: NIMS-Ping II-NIMS ప్రాంగణం వద్ద బయో- మెడికల్ వ్యర్థాల నిర్వహణ సర్వీస్ల యొక్క శుద్ధి మరియు పరిష్కారానికి టెండర్-ప్రముఖ వార్తా పత్రికలలో ప్రకటన ప్రచురణ నిమిత్తం - అభ్యర్థన - గురించి. 3) ఫైల్ నంబర్ Ping II/152/2025/OT లైట్స్/NSICU. పని పేరు: NIMS-ప్లానింగ్-OT లైట్స్ యొక్క సేకరణ-టెండర్ ప్రకటన జారీ చేయవలసి ఉంది.- టెండర్ ప్రకటనను వార్తా పత్రికలలో ప్రచురించుట కొరకు అభ్యర్థన-గురించి. పూర్తి టెండర్ షెడ్యూల్ కొరకు బిడ్డర్లు వెబ్సైట్ https://eprocurement.telangana.gov.in వీక్షించవలసినదిగా కోరడమైనది.
DIPR.No.8792-PP/CL/Advt/1/2026-27, తేది: 28.08.2026 సం/- ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్

# మేజర్ ధ్యాన్చంద్ జయంతి సందర్భంగా ఎల్ఐసి ఉద్యోగులకు క్రీడాపోటీలు

**ముంబయి, ఆగస్టు 28:** జీవితబీమా సంస్థ ఎల్ఐసి జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఈనెల 28 నుంచి 30వ తేదీవరకూ విస్తృత ప్రచారం నిర్వహించనున్నది. అలాగే హాకి దిగ్గజం మేజర్ ధ్యాన్చంద్ జయంతి సందర్భగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసి ప్రకటించింది. దేశ వ్యాప్తంగా ఎల్ఐసి కార్యాలయాల్లో ఇండోర్, ఔట్డోర్ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఎల్ఐసి ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని ఇనుమడింపచేయడంతోపాటు ఫిజికల్ ఫిట్నెస్కు కూడా ప్రాధాన్యతనిచ్చే విధంగా ఈ పోటీలు ఉంటాయని వెల్ల డించింది. ముంబయిలో ఎల్ఐసి ఇండోర్ క్రీడలను శనివారం నిర్వహించనున్నది. ఫిజికల్ ఫిట్నెస్తోపాటు ఆరోగ్యకర జీవనశైలిని ఉద్యోగుల్లో అలవరిచేందుకు ఈ పోటీలు దోహదంచేస్తాయని ఎల్ఐసి వెల్లడించింది.




## అమెరికాలో హైదరాబాద్ యువతి హత్య కేసు

# ఆమె స్నేహితుడు ఆగ్రాలో అరెస్టు

### తీహార్ జైలుకు తరలించిన పోలీసులు



అమెరికాలో హత్యకు గురైన నిఖిత. పక్కన నిందితుడు అర్జున్శర్మ

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** అమెరికాలో సంచలనం రేపిన హైదరాబాద్ లాలాగూడ యువతి నిఖిత గొడిశాల (28) హత్య కేసులో నిందితుడుగా వున్న ఆమె స్నేహితుడు అర్జున్శర్మ (32)ను తెలంగాణ పోలీసులు ఆగ్రాలో శుక్రవారం అరెస్టు చేశారు. లాలాగూలోని విజయ పూరి కాలనీకి చెందిన నిఖిత గొడిశాల నాలుగేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లింది. అమెరికాలోని మేరీలాండ్లో వుంటూ చదువుకుంటుంది. ఆమెతో భారత్కు చెందిన అర్జున్ శర్మ సన్నిహితంగా వుంటున్నాడు. అయితే నిఖిత వద్ద అర్జున్ శర్మ రెండు లక్షల రూపాయ లు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే కారణంగా గత ఏడాది డిసెంబర్ 31వ తే దీన నిఖితను ఆమె వుండే అపార్ట్మెంట్లోనే అర్జున్ శర్మ కత్తితో పలుమార్లు పొడిచి చంపేశాడు. ఇదే సమయంలో నిఖిత కోసం హైదరాబాద్ లోని ఆమె తల్లి దండ్రులు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో అర్జున్ శర్మను సంప్రదించగా తాను కూడా ఆమెను కలిసి నాలుగు రోజులయ్యిందని, ఫోన్ చేసినా స్పందించడం లేదని తెలిపాడు. దీని తరువాత జనవరి రెండవ తేదీన నిఖిత కనిపించడం లేదని అర్జున్ శర్మ మేరీలాండ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చివరిసారిగా డిసెంబరు 31న చూసినట్లు పోలీసులకు తెలిపాడు. ఈ ఫిర్యాదుపై రంగంలో ది గిన అమెరికా పోలీసులు ఆమె వుండే అపార్ట్మెంట్లో తనిఖీ చేయగా కత్తిపోట్లతో చనిపోయి వుండడం కనిపించింది. అప్పటికే శవం బాగా కు ళ్లిపోవడంతో మృతదేహాన్ని మార్చ్యూరీకి తరలించి వైద్య పరీక్షల తరువాత భద్రపరిచారు. నిఖిత హత్యపై ఆమె తండ్రి ఆనంద్కు సమాచారం అందించారు. తమ కూతురు హత్యకు అర్జున్ శర్మ కారణమని ఆమె తండ్రి ఆనంద్ అమెరికా పోలీసులకు చెప్పడంతో పాటు ఇదే విషయమై లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై లాలాగూడ పోలీసులు అమెరికా పోలీసులకు సమాచారం అందించి అర్జున్ శర్మను వి చారించాలని కోరారు. అయితే అప్పటికే అర్జున్ శర్మ అమెరికా నుంచి పారిపోయి భారత్కు వచ్చేశాడు. అప్పటి నుంచి అతను భారత్లో అనేక చోట్ల మకాం మార్చి తిరుగుతున్నాడు. ఇతని కోసం అమెరికా పోలీసులతో పాటు తెలంగాణ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అర్జున్ శ ర్మ పట్టుబడితే తమకు అప్పగించాలని అమెరికా పోలీసులు భారత్ను కోరారు.అర్జున్ శర్మ కోసం తెలంగాణ పోలీసులు దేశ వ్యాప్తంగా గత ఎనిమిది నెలలుగా గాలిస్తున్న క్రమంలో అతను ఆగ్రాలో ఓ అపార్ట్మెంట్లో వుంటున్నట్లు అందిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం దాడిచేశారు. అనంతరం అతడిని అరెస్టు చేశారు. దీని తరువాత అతన్ని ఢిల్లీలోని పాటియాల కోర్టులో హాజరు పరిచి తిహార్ జైలుకు తరలించారు. అర్జున్శర్మ అరెస్టుకు సంబంధించి అమెరికా రాయబార కార్యాలయానికి సమా చారం అందించారు. ఈ సమాచారాన్ని అమెరికా రాయబార కార్యాలయం తమ దేశ పోలీసులకు అందించారు. దీంతో అమెరికా నుంచి ఓ పోలీసు బృందం భారత్కు బయలుదేరింది. అర్జున్శర్మను శనివారం అమెరికా పోలీసులు తమతోపాటు తీసుకువెళ్లే వీలుంది. కాగా అర్జున్శర్మ అరెస్టుపై నిఖిత తల్లి దండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. తమ కూతురును అన్యాయంగా హత్య చేసిన నిందితుడికి కఠినశిక్ష పడాలని వారు కోరారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం -7
రూఢీ ప్రకటన
(కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి) కలెక్టర్/అదనపు కలెక్టర్/రాజస్వ మండలాధికారి సూర్యాపేట (భూసేకరణ)
జిల్లా కలెక్టరు ఫైల్ సంఖ్య: G/2277/2025 తేది : 25.08.2026
RDO ఫైల్ సంఖ్య: సి/1960/2025 తేది : 24.08.2026
గెజిట్ సంఖ్య : 49/2026 తేది : 25.08.2026
తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ డివిజన్-1 సూర్యాపేట గారు ఇచ్చిన రిక్విజిషన్ ప్రకారము ఈ దిగువ షెడ్యూల్లో నిర్దిష్ట పరచిన మోతే మండలము విభళాపురం గ్రామ శివారులో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.7.33½ గుంటలు ప్రజా ప్రయోజన నిమిత్తం అన్నారిగూడెం సమీపంలో పాలేరు రిజర్వాయర్ పై నిర్మించే ఇరిగేషన్ పథకం SRSP Stage-II యొక్క 22L, 36L minor of DBM-71 క్రింద ఆయకట్టు భర్తీ చేయుట నిర్మాణము కొరకు (అ)వసరమైనదని నిర్ధయించినారు.
కావున సూర్యాపేట జిల్లాలో మోతే మండలం విభళాపురం గ్రామములో విస్తీర్ణము ఎ.7.33½ గుంటలు పట్టా భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన భూమి ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా అన్నారిగూడెం సమీపంలో పాలేరు రిజర్వాయర్ పై నిర్మించే ఇరిగేషన్ పథకం SRSP Stage-II యొక్క 22L, 36L minor of DBM-71 క్రింద ఆయకట్టు భర్తీ చేయుట నిర్మాణము కొరకు అవసరమైనందున భూమి సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.
గ్రామము : విభళాపురం మండలం: మోతే జిల్లా : సూర్యాపేట

| క్ర సం | సర్వే నెంబర్ | భూమి మాన్యపు రకం | భూమి రకం | సేకరించబడు భూమి విస్తీర్ణం ఎ.గుంటలు/స.గ | పట్టాదారు పేరు మరియు అనుభవదారు పేరు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు/నిర్మాణాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 27 | పట్టా | మెట్ట | 0.22 | మైనంపాటిరాంరెడ్డి తండ్రి నర్సిరెడ్డి (పతిల) | 27 | 27 | 35 | 26 | |
| 2 | 120 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.08<br>0.09<br>1.325<br>1.325<br>0.10 | కంపెల్లి సత్యం తండ్రి మట్టయ్య (అ)<br>దున్నపోతుల మల్లార్ తండ్రి పుల్లయ్య (అ)<br>దార సుధాకర్ తండ్రి వెంకటయ్య (అ)<br>దార చందర్రావు తండ్రి కోటయ్య (అ)<br>షేక్ సోందు తండ్రి బడేసాబ్ (అ) | | | | | పాలేరు రిజర్వాయర్ మునక |
| 3 | 149 | పట్టా | మెట్ట | 1.25 | ఏలూరి సరస్వతి భర్త పున్నయ్య (పతిల) | 149 | 149 | 148 | డొంక, 150 | |
| 4 | 150 | పట్టా | మెట్ట | 1.04 | ఏలూరి సరస్వతి భర్త పున్నయ్య (పతిల) | 150 | 150 | 150 | డొంక | వేప చెట్టు-01,50-పైపులు |
| 5 | 557 | పట్టా | మెట్ట | 0.02<br>$0.03^{1}/_{2}$<br>0.05 | అంగోతు లక్ష్మి భర్త స్వరాజ్యం (అ)<br>అంగోతు తావుర్య తండ్రి జేత్య (అ)<br>అంగోతు లక్పతి తండ్రి పాపా (అ)<br>గుగులోత్ రవీందర్ తండ్రి హేమ్లా (ప)<br>గుగులోతు శ్రీను తండ్రి హేమ్లా (ప)<br>గుగులోతు రమేష్ తండ్రి హేమ్లా (ప)<br>దర్మసోతు శంకర్ తండ్రి చిన రాజు (ప)<br>గుగులోతు శ్రీరామ్ తండ్రి దుబ్లా (ప)<br>గుగులోతు రాంబాబు తండ్రి సూర్య (ప)<br>గుగులోతు రామ్మీ తండ్రి సూర్య (ప)<br>గుగులోతు నాజమ్మ భర్త సూర్య (ప)<br>గుగులోతు బిక్కు తండ్రి చందు (ప)<br>గుగులోతు వీరన్న తండ్రి స్వామి (ప)<br>గుగులోతుమంగు తండ్రి భాసింగ్ (ప)<br>భుక్య పద్మ భర్త వెంకన్న (ప)<br>గుగులోతు నాగు తండ్రి జగ్గా (ప)<br>గుగులోతు రాంకోటి తండ్రి జగ్గా (ప)<br>గుగులోతు శ్రీను తండ్రి భోజ్య (ప)<br>తేజావత్ మౌనిక భర్త నరేష్ (ప) | 557 | 557 | 556 | 559 | విద్యుత్ స్తంభం |
| | | మొత్తం | | $7.33^{1}/_{2}$ | | | | | | |

ప్రతిపాదిత భూసేకరణ విషయములో వచ్చిన అభ్యంతరములపై భూసేకరణ చట్టం 30/2013 నియమంలోని సెక్షన్ 15 ప్రకారం విచారణ జరపబడింది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునారావాసం కల్పించుట లేదు.
భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములో ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడదు.
పైన భూమిని భూసేకరణ చేయు భూములు యొక్క నమూనా భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి సూర్యాపేట నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకొనవచ్చును.
సం/-.భూసేకరణ అధికారి & రెవిన్యూ డివిజనల్ అధికారి సూర్యాపేట | సం/- అదనపు కలెక్టర్, సూర్యాపేట | సం/-. జిల్లా కలెక్టర్ సూర్యాపేట
DIPR RO.NO:777/LA/PP/Advt/Pub/2026-27

# నకిలీ పురుగుమందులు శాంతి, భద్రతలకు భంగం కలిగించవు

### పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** నకిలీ, నాణ్యత లేని, తప్పుడు బ్రాండింగ్తో కూడిన పురుగుమందుల తయారీ, నిల్వ, అమ్మకం, పంపిణీ వంటి కార్యకలాపాలు ప్రజల శాంతి, భద్రతలకు భంగం కలిగించవని, వాటిని కేవలం వాణిజ్య నేరాలుగా పరిగణించలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ ప్రమాదకర కార్యకలాపాల నివారణ చట్టం, 1986 కింద తేది 8 సెప్టెంబర్ 2025న జారీ చేసిన తన భర్త నిర్బంధ ఉత్తర్వును సవాలు చేస్తూ ముద్దంగుళ ఆదిత్య భార్య ముద్దంగుళ అనురాధ దాఖలు చేసిన రిట్ పిటిషన్ను జస్టిస్లు మోషుమి భట్టాచార్య, రేణుక యారాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ఆదిత్య ఉత్తర ప్రదేశ్ నుండి తక్కువ ధరలకు నకిలీ పురుగుమందులను కొనుగోలు చేసి, వాటిని వివిధ కంపెనీల పేర్లతో తిరిగి ప్యాక్ చేసి, ఏజెంట్ల ద్వారా రైతులకు విక్రయించాడనే ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2025లో అతనిపై నాలుగు కేసులు నమోదయ్యాయని, ప్రయోగశాల పరీక్షల్లో అనేక పురుగుమందుల నమూనాలు తప్పుడు బ్రాండింగ్తో ఉన్నట్లు తేలిందని కోర్టు పేర్కొంది. ఒక కేసులో, కోర్టెవా అగ్రిసైన్స్, బేయర్ పేర్లతో ఉన్న నకిలీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఉండగా, మరొక కేసులో నకిలీ, గడువు ముగిసిన పురుగుమందులు ఉన్నాయి. వేరొక కేసులో, సుమారు రూ. 53.55 లక్షల విలువైన నకిలీ విత్తనాలు మరియు పురుగుమందులను స్వాధీనం చేసుకున్నారు. అనేక నమూనాలలో క్రియాశీల పదార్థాల స్థాయిలు తగినంతగా లేకపోవడం వల్ల పంట దిగుబడులు తగ్గి, రైతులకు ఆర్థిక నష్టాలు వాటిల్లవచ్చని, ఇది వ్యవసాయ వర్గాలలో అశాంతికి దారితీయవచ్చని ధర్మాసనం గుర్తించింది. నిర్బంధ ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం లేదని భావించిన ధర్మాసనం, రిట్ పిటిషన్తో పాటు, దానికి అనుబంధంగా ఉన్న అన్ని పిటిషన్లను కొట్టివేసింది.

# నటుడు నారాయణరావుకు కన్నీటి వీడ్కోలు

### ఘనంగా నివాళులర్పించిన చిరంజీవి, మురళీమోహన్ ప్రభృతులు



నటుడు నారాయణరావు భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మెగాస్టార్ చిరంజీవి

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ప్రముఖ నటుడు, నిర్మాత జీవీ నారాయణ రావు(73) అంత్యక్రియలు ముగిశాయి. హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో శుక్రవారం ఆయన అంతిమ సంస్కారాలు శాస్త్రోక్తంగా జరిగాయి. విదేశాల నుంచి వచ్చిన ఆయన కుమారుడు, కుమార్తె ఈ కార్యక్రమాలు పూర్తి చేశారు. అంతకు ముందు, పలు వురు సినీ ప్రముఖులు జీవీ నారాయణరావు భౌతిక కాయానికి నివాళుల ర్పించారు. కొంత కాలం గా అనారోగ్యంతో బాధపడు తున్న జీవీ నారా యణరావు బుధ వారం రాత్రి కన్ను మూసిన విషయం తెలి సిందే. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం లో వచ్చిన 'అంతులేని కథ' చిత్రం తో నటుడిగా అరంగేట్రం చేసిన జీవీ, ఆ తర్వాత ఎన్నో చిత్రాలు, టీవీ సీరి యళ్లలో విలక్షణ పాత్రలు పోషించారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా ఆయన తనదైన ముద్ర వేశారు.

తన మిత్రుడు జీవీ నారాయణరావు అంత్య క్రియలకు ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి హాజరయ్యారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన చిరంజీవి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సీనియర్ నటుడు మురళీమోహన్తోపాటు పలువురు టాలీవుడ్ ప్రముఖులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.



రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా శుక్రవారం ఎర్రవల్లిలోని నివాసంలో మాజీ సిఎం కెసిఆర్‌కు రాఖీ కడుతున్న మహిళ

## టికెట్ లేని ప్రయాణికులపై రైల్వే కొరడా

### జోన్ వ్యాప్తంగా భారీ టికెట్ తనిఖీ డ్రైవ్

### నిర్వహించిన దక్షిణ మధ్యరైల్వే

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 28, ప్రభాతవార్త :** దక్షిణ మధ్యరైల్వే అధికారులు జోనల్ స్థాయిలో మూడు రోజుల పాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో టికెట్ లేని ప్రయాణికులపై రైల్వే కొరడా ఝులిపించింది. పండుగ, సెలవుల రద్దీ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మూడు రోజులపాటు భారీ టికెట్ తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. ఆగస్టు 24 నుంచి 26 వరకు జరిగిన ఈ తనిఖీల్లో టికెట్ లేకుండా లేదా సరైన అనుమతి లేకుండా ప్రయాణిస్తున్న 13964 మందిని గుర్తించారు. వారి నుంచి టికెట్ తనిఖీల ద్వారా రూ.1.28 కోట్ల ఆదాయం సమకూరింది.బుక్ చేయని లగేజీతో ప్రయాణిస్తున్న 1,189 మందిపైనా చర్యలు తీసుకున్నారు. రైల్వే ప్రాంగణాల్లో చెత్త వేస్తున్న 37 మందికి రూ.6,400, అనధికారిక వ్యాపారులు ఐదుగురికి రూ.10,000, ధూమపానం చేస్తున్న ఏడుగురికి రూ.14,000 జరిమానా విధించారు.టికెట్ తనిఖీల సందర్భంగా ప్రయాణికులకు సరైన టికెట్‌తో ప్రయాణించాల్సిన ఆవశ్యకత, రైల్వే నిబంధనలు పాటించడం, పరిశుభ్రత, ధూమపానం వల్ల కలిగే అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. చెల్లుబాటు అయ్యే టికెట్లతో ప్రయాణించి, తనిఖీ సిబ్బందికి సహకరించాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.విస్తృత తనిఖీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వాణిజ్య విభాగాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అభినందించారు. టికెట్ తనిఖీలు అక్రమ ప్రయాణాలను అరికట్టడంతోపాటు నిజమైన ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.

## పాసైన టెన్త్ విద్యార్థులకు లాంగ్ మెమోలు జారీ

### నేటి నుంచి పాఠశాలల్లో అందుబాటులోకి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు28:** మార్చిలో జరిగిన ఎస్ఎస్‌సి పరీక్షల్లో పాసైన వారితోపాటు, జూన్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లోనూ ఉత్తీర్ణులైన విద్యార్థులకు లాంగ్ మెమోలను ఎస్ఎస్‌సి బోర్డు సిద్ధం చేసింది. మార్చిలో, జూన్‌లో పాసైన విద్యార్థులకు సంబంధించిన లాంగ్ మెమోలను పాఠశాలలకు పంపించినట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ కె లింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నేటి(శనివారం) నుంచి తమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుంచి లాంగ్ మెమోలను తీసుకోవచ్చని తెలిపారు. మార్చిలో, జూన్‌లో కలిపి 98 శాతానికిపైగా విద్యార్థులు పాసయ్యారు. సుమారు 4.80 లక్షల మంది విద్యార్థులు ఈ ఏడాది పాసయ్యారు. వారందరికీ లాంగ్ మెమోలను జారీ చేసినట్టు లింగయ్య తెలిపారు.

## ఉపాధ్యాయులకు టెట్ నుంచి శాశ్వత మినహాయింపు ఇవ్వాలి

### మంత్రి వాకిటి శ్రీహరికి ఆర్‌యుపిపి-టిఎస్ వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు28:** 2010 సంవత్సరానికి పూర్వం అప్పటి నిబంధనల ప్రకారం అన్ని అర్హతలతో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియామకమైన వారికి ప్రస్తుతం తప్పనిసరిగా గినిగి ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన నుంచి శాశ్వత మినహాయింపు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రత్యేక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు-తెలంగాణ (ఆర్‌యుపిపి-టిఎస్) రాష్ట్ర అధ్యక్షులు శానమోని నర్సిములు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయన పండిత పరిషత్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.ఎన్. విజయ్ కుమార్‌తో కలిసి శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టెట్ మినహాయింపు, టెట్ పేపర్2లో శాస్త్రీయ మార్పులు తదితర అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

## 'కేంద్రం విద్యుత్ సంస్కరణల చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి'

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 28, ప్రభాతవార్త:** విద్యుత్ అమరవీరులను స్మరించుకుంటూ శుక్రవారం నగరంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమై బషీర్‌బాగ్ చౌరస్తాలోని విద్యుత్ అమర వీరుల స్థూపం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వామపక్ష పార్టీ కార్యకర్తలు విద్యుత్ అమర వీరులను స్మరించుకుంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారు అమర వీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణ పేరుతో కార్పోరేట్ శక్తులకు విద్యుత్ రంగాన్ని అప్పగించి కోట్లాది రూపాయల భారాన్ని ప్రజలపై మోపడానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. తక్షణమే విద్యుత్ సంస్కరణ చట్టాన్ని ఉపసంహారించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు వ్యవసాయానికి ఉపయోగించే మోటార్లుకు మీటర్లు బిగించి నెలనెల డబ్బులు వసూలు చేయాలనే దుర్మార్గపు ఆలోచనలో ఉందని, ఇందుకు అన్ని రాష్ట్రాలపై వత్తిడీ తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. దీనిపై ఇప్పటికై దేశవ్యాప్తంగా 500 రైతు సంఘాల పార్టీలు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లమీదకు వచ్చి నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెపా ల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రదర్శనలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు ఝాన్సీ, వామపక్ష పార్టీల నేతలు వి.ఎస్.బోస్, డి.జి.నర్సింగ్‌రావు, చంద్రశేఖర్, స్టాలిన్, పల్లె నర్సింహ్మా, జ్యోతి, లక్ష్మి, టి.సాగర్, సూర్యం, సదానందం, ఎస్.ఎల్.పద్మ, నెర్లకంటి శ్రీకాంత్, స్కైలాబ్‌బాబు, అరుణ, అనురాధ, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పండుగకు టిజిఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు28:** రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ ధరలను భారీగా పెంచడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పండుగ పూట తమ స్వగ్రామాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు ఈ అదనపు ఛార్జీల బాదుడు భారంగా మారింది రాఖీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 27 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, ఈ బస్సుల్లో సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి జడ్చర్లకు సాధారణ ఛార్జీ రూ. 150 ఉండగా, ప్రత్యేక బస్సుల్లో దానిని రూ. 190కి పెంచారు. అదేవిధంగా, కరీంనగర్‌కు వెళ్లే సూపర్ డీలక్స్ బస్సులో సాధారణ టికెట్ ధర రూ. 300 ఉండగా, ప్రస్తుతం రూ.400 వసూలు చేస్తున్నారు, చార్జీల పెంపుపై ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ధరల పెంపుపై ముందే ప్రకటన విడుదల చేస్తే బాగుండేదని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

# ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లో నేటి నుంచి ప్రధాని మోడీ పర్యటన

### బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సదస్సుకు హాజరు

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్ దేశాలలో నాలుగు రోజులపాటు పర్యటించనున్నారు. మధ్య ఆసియా ప్రాంతంతో వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాల బలోపేతం ఈ పర్యటనలో భారత్‌కు కీలక అంశంగా ఉండనుంది.పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ తొలుత ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌కు చేరుకుంటారు. అక్కడ ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతం, వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, రక్షణ, ఆరోగ్య రంగం, ఇంధనం, డిజిటల్ కనెక్టివిటీ, విద్య, సాంకేతికత తదితర అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఫార్మాస్యూటికల్స్, అంతరిక్ష రంగం, బిజినెస్ టు బిజినెస్ సహకారంలో కొత్త అవకాశాలను అన్వేషించడంపైనా ఇరు దేశాలు దృష్టి సారించనున్నాయి. ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు భారత్, ఉజ్బెకిస్థాన్ ప్రయత్నిస్తున్నాయి. వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు శని, ఆదివారాల్లో తాష్కెంట్‌లో ప్రధాని మోడీ, అధ్యక్షుడు మిర్జియోయెవ్ నేతృ త్వంలో ప్రతినిధి స్థాయి చర్చలు జరగనున్నాయి. మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు మోడీ ఈ పర్యటన చేపడుతున్నారు. ఇది ఉజ్బెకిస్థాన్‌కు ప్రధాని మోడీ నాలుగో పర్యటన కాగా, ద్వైపాక్షిక పర్యటనగా రెండోసారి. భారత్-ఉజ్బెకిస్థాన్ సహకారంలోని అన్ని రంగాలను ఇరువురు నేతలు సమీక్షించడంతోపాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించ నున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే మార్గాలపైనా ఇరువురు నేతలు చర్చించే అవకాశం ఉంది.వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఆరోగ్య రంగాలపై దృష్టి తాష్కెంట్ చర్చల్లో ఆర్థిక సహకారం ప్రధాన అంశంగా ఉండనుంది. వాణిజ్యం, పెట్టుబడులు, బిజినెస్ టు బిజినెస్ సహకారంలో కొత్త అవకాశాలను గుర్తించేందుకు ఇరు దేశాలు ప్రయత్నించనున్నాయి. ఉజ్బెకిస్థాన్‌కు భారత్ టాప్10 వాణిజ్య భాగస్వాముల్లో ఒకటిగా ఉంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షి వాణిజ్యం, పెట్టుబడుల విలువ కలిపి దాదాపు 100 కోట్ల డాలర్లకు చేరుకుంది. కీలక ఖనిజాలు, ఔషధాలు, ఆరోగ్య రంగం, సమాచార సాంకేతికత, టెక్నాలజీ వంటి రంగాల్లో ఇప్పటికే ఇరు దేశాల మధ్య సహకారం ఉంది. అంతరిక్షం, సాంకేతికత, ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాల్లోనూ సహకారాన్ని విస్తరించే అవకాశాలను పరిశీలించనున్నారు. ఉజ్బెకిస్థాన్‌లో 16 వేల మందికి పైగా భారతీయ విద్యార్థులు భారత్ ఉజ్బెకిస్థాన్ సంబంధాల్లో విద్య, ప్రజల మధ్య సంబంధాలు కూడా కీలకంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్‌లో 16,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారని విదేశాంగ శాఖ కార్యదర్శి సిబి జార్జ్ తెలిపారు. అలాగే నాలుగు భారతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు అక్కడ ఏర్పాటు అయ్యాయి. ఉజ్బెకిస్థాన్‌లో ఔషధాలు, వినోద పార్కులు, ఆటోమొబైల్ విడిభాగాలు, విద్య తదితర రంగాల్లో భారతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత విస్తరిస్తున్నాయి. అక్కడినుంచి బిష్కెక్‌లో జరగనున్న ఎస్‌సిఒ సదస్సులో పాల్గొంటారు. కిర్గిజ్ అధ్యక్షుడు సాద్యిర్ ఝాపరోవ్ ఆహ్వానం మేరకు ఎస్‌సిఒ సదస్సులో పాల్గొనేందుకు మోడీ ఆదేశం పర్యటిస్తున్నారు.

## మహిళా సాధికారతకు కట్టుబడిన మోడీ సర్కారు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు

### ఘనంగా పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు



డాక్టర్ మేకల శిల్పారెడ్డి అధ్యక్షతన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పాల్గొని ప్రసంగించారు. భారతీయ సనాతన సంస్కృతిలో అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల పవిత్ర అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీక అని ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రాచీన కాలంలో యుద్ధ రంగానికి వెళ్లే సైనికులకు మహిళలు రక్షాబంధన్ కట్టి వారి భద్రతను, విజయాన్ని కాంక్షి ంచే గొప్ప సంప్రదాయం మన దేశంలో ఉందని గుర్తుచేశారు. నేటికీ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికులకు దేశవ్యాప్తంగా మహిళా సోదరీమణులు రాఖీలు కడుతున్నారని తెలిపారు. నీకు నేను రక్ష నాకు మీరు రక్ష మనమిద్దరం కలిసి ఈ దేశానికి, ధర్మానికి రక్ష అనే ఉన్నతమైన భావనే రక్షాబంధన్ పండుగలోని అసలైన పరమార్థమని ఆయన స్పష్టం చేశారు. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మహిళా సంక్షేమం, సాధికారతకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు. పొగచూరిన వంటిళ్లలో బాధపడుతున్న కోట్లాది మంది తల్లులు, సోదరీమణుల ఆరోగ్యం కోసం పిఎం ఉజ్వల యోజన ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందించారని తెలిపారు. గర్భిణులు, బాలింతల పోషణ, ఆరోగ్య భద్రత కోసం ప్రధానమంత్రి మాతృ వందన యోజన్న ద్వారా ఆర్థిక భరోసా కల్పించారన్నారు. అంతే కాకుండా, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహి ళల రాజకీయ హక్కులను నెరవేరుస్తూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారి త్రాత్మక నారీ శక్తి వందన్ అధిని యం చట్టాన్ని పార్ల మెంటులో మోడీ ప్రభు త్వం తీసుకు వచ్చిందని గుర్తు చేశారు. అయితే, ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో ఈ చారి త్రాత్మక 33 శాతం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తీసుకువస్తే కాంగ్రెస్ ఇండియా కూటమి పార్టీలు అడు గడుగునా అడ్డుకు నేందుకు ప్రయత్నిం చాయని ఆయన మండి పడ్డారు. మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం దక్కకుండా అడ్డంకులు సృష్టించిన కాంగ్రెస్, ఇండి కూటమి పార్టీలు పచ్చి మహిళా వ్యతిరేక పార్టీలని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ వేదికపై ఉన్న నేతతో కలిసి మోడీ ఆలింగనాన్ని వెకిలిగా ప్రదర్శిస్తూ, ఒక మహిళా ప్రధానిని అవమానించేలా, స్త్రీ ద్వేషపూరిత ధోరణితో ప్రవర్తించడం రాహుల్ గాంధీ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నటి కంగనా రనౌత్‌ను అభ్యర్థిగా ప్రకటించినప్పుడు, అలాగే దేశంలోనే తొలి గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా నిలబెట్టినప్పుడు కాంగ్రెస్ నాయకులు చేసిన అవమానకర వ్యాఖ్యలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని గుర్తుచేశారు. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాళ్లు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకి, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకి, శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డికి, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



రక్షాబంధన్ సందర్భంగా ఎపి సిఎం చంద్రబాబుకు రాఖీలు కట్టిన టిడిపి మహిళా నేతలు

## ఎపి సిఎం చంద్రబాబుకు రాఖీ కట్టిన మహిళా నేతలు

**విజయవాడ, ఆగస్టు 28, ప్రభాతవార్త ప్రతినిధి:** రాఖీ పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్య మంత్రికి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు వారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. సిఎంను కలిసిన వారిలో మంత్రి సవిత, మాజీ మంత్రి పీతల సుజాత, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత, తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లక్కీడ్రా ప్రక్రియలో ఆసక్తికరమైన సన్నివేశం

### టోకెన్ తీసిన బాలుడి కుటుంబాన్నే వరించిన అదృష్టం

### వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసిన మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు28:** హైదరాబాద్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు నేడు లక్కీడ్రా ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి లక్ష్మీ ్మగూడలో ఆసక్తికరమైన సన్నివేశం ఎదురైంది. లక్కీ డ్రా టోకెన్‌ను ఓ బాలుడితో తీయించగా ఆ చిన్నోడి కుటుంబాన్నే ఇల్లు వరించడం అందరినీ ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేసింది. దానికి సంబంధించిన వీడియోను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. పేదల సొంతింటి కల తీర్చాలనే ఈ ప్రభుత్వ సంకల్పానికి, దేవుడి ఆశీస్సులు తోడైనట్టు చిన్నోడు తీసిన లక్కీ డ్రాలో వారి కుటుంబానికే (జరపుల లక్ష్మీ ్మ) టోకెన్ రావడం తమ అందరినీ ఆనందానికి, ఆశ్చర్యానికి గురిచేసిందని మంత్రి చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాలు చాలా అరుదు, చిన్న పిల్లలు దేవుళ్లతో సమానమని ఆయన గుర్తుచేశారు. చిన్నారులు స్వచ్ఛమైన మనసు కలిగినవారని ఆ దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నెర వేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బతకాలని, ఆ ఆడబిడ్డను ఆశీర్వదించానని మంత్రి వీడియోను షేర్ చేశారు.

## తండ్రి పేరు సవరణకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సర్ నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు28:** తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వయంగా మంత్రిని కలిసి ఈ నోటీసును అందజేశారు. ఓటర్ల జాబితాలో మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి సత్తయ్య గౌడ్ పేరు తప్పుగా నమోదైంది. ఈ విషయాన్ని గుర్తించిన బీఎల్ఓ, నిబంధనల ప్రకారం సవరణ నిమిత్తం మంత్రికి నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఇది సాధారణంగా జరిగే ప్రక్రియేనని ఎన్నికల అధికారులు తెలిపారు. నోటీసులపై మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించారు. తన తండ్రి పేరును సరిచేయడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఆయన బీఎల్ఓకు సమర్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దేందుకే ఖిసర్‌ఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలను సరిచూస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రికి కూడా నోటీసు అందినట్లు స్పష్టమవుతోంది.

## గంజాయి స్మగ్లర్ల కోసం ఈగల్ పోలీసుల 18 గంటల వేట

### ఒడిశా నుంచి హైదరాబాద్‌కు రవాణా.. చౌటుప్పల్‌లో పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** గంజాయి స్మగ్లర్ల కోసం ఈగల్ పోలీసుల దాడులు కొనసాగుతూనే వున్నాయి. స్మగ్లర్ల భరతం పట్టేందుకు ఇతర రాష్ట్రాలలోని గంజాయి స్మగ్లర్ల డెన్‌లపై దాడులకు దిగుతున్న ఈగల్ పోలీసులు ఇదే సమయంలో వారిని పట్టుకునేందుకు సుధీర్ఘ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఇలాంటి ఘటన మరొకటి జరగగా ఒడిషాకు చెందిన ఇద్దరు స్మగ్లర్లు పట్టుబడ్డారు. వీరి వద్ద 20.5 కిలోల గంజాయి లభ్యమయ్యింది. వీరిని పట్టుకునేందుకు ఈగల్ పోలీసులు ఆయా ప్రాంతాల పోలీసుల సహకారంతో 18 గంటల పాటు వేట నిర్వహించారు. ఒడిషా నుంచి కొందరు స్మగ్లర్లు కార్లలో హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఈగల్ పోలీసులు ఒడిషాలోనే నిఘా వుంచారు. అక్కడి నుంచి ఒడి 02 డిఎస్ 0897 నంబరు గల కారు గంజాయితో బయలుదేరింది. ఈ కారును ఈగల్ పోలీసులు ఒడిషా నుంచి వెంబడించారు. ఈ క్రమంలో స్మగ్లర్లు ఎపిలోని పలుచోట్ల ఏడు గంటల పాటు ఆగారు. అనం తరం ఖమ్మం మీదుగా వేగంగా వచ్చి చౌటుప్పల్ మార్గంలో ప్రయాణం సాగించారు. ఈగల్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో వారిని వెంబడించారు. ఒక దశలో స్మగ్లర్ల వాహనం అతి వేగంతో వెళ్లగా పోలీసులు కూడా వారిని వెంబడించారు. చివరకు చౌటుప్పల్ వద్దగల పంతంగి టోల్ గేట్ వద్ద స్మగ్లర్ల వాహనం నెమ్మదించగా ఈగల్ పోలీసులు రెప్పపాటులో దాడిచేసి కారును అదుపులోకి తీసుకున్నారు. అందులోని స్మగ్లర్లు ఒడిషాకు చెందిన త్రిలోచన్ మంత్ర (30), సాగర్‌వాల్ (23)లను అరెస్టు చేశారు. కారుతో పాటు అందులోని 20.05 కిలోల గంజాయిని, మూడు సెల్ ఫోన్లను జప్తు చేశా రు. ఇందులో త్రిలోచన్ మ ంత్రపై ఒడిషాతో పాటు తెలుగు రాష్ట్రాల్లో అనేక క్రిమినల్ కేసులున్నాయి. ఈ కేసులో గంజాయిని హైదరాబాద్‌లో తీసుకునే మరో స్మగ్లర్ బికాషార్బిక్, ఒడిషాకు చెందిన బడా స్మగ్లర్ అమిత్ సహాని కోసం గాలిస్తున్నారు. కాగా గంజాయి సహా అన్ని రకాల మాదకద్రవ్యాల కట్టడికి పనిచేస్తున్న ఈగల్ పోలీసులకు అందరు సహకరించాలని ఈ విభాగం డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు. గంజాయి సహా మాదకద్రవ్యాలకు సంబంధించి సమాచారం వుంటే 1908 లేదా 8712671111కు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

## కర్ణాటకలో ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

### ఆర్ఎస్ఎస్ మీట్‌లో పాల్గొన్నారన్న అభియోగం

**బెంగళూరు, ఆగస్టు 28:** కర్ణాటకలో ఇద్దరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. ఆర్ఎస్ఎస్ పథసంచలనంలో పాల్గొన్నందుకు యాద్గిర్ జిల్లాకు చెందిన ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. యాద్గిర్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ చెన్నబసప్ప ముధోల్ ఆగస్టు 20న ఉత్తర్వులు జారీ చేశారు. హునసగి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ టీచర్‌గా పనిచేస్తున్న గురురాజ్ జోషి, సుర్‌పూర్ తాలూకా కుప్పి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నా సాహెబ్ దేశ్‌ముఖ్‌పై చర్యలు తీసుకున్నారు. కర్ణాటక సివిల్ సర్వీసెస్ రూల్స్ 2021లోని పలు నిబంధనలను వారు ఉల్లంఘించినట్లు విద్యాశాఖ పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని నిబంధనలు చెబుతున్నాయని తెలిపింది. టీచర్లు సమాజానికి ఆదర్శంగా ఉండాలని కూడా స్పష్టం చేసింది. గురురాజ్ జోషి 2025 అక్టోబర్ 12న విజయపుర జిల్లాలోని తాళికోటలో జరిగిన ఆర్ఎస్ఎస్ పథసంచలనంలో పాల్గొన్నట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించిన ఫొటో విజయ కర్ణాటక పత్రికలో ప్రచురితమైంది. ఆ తర్వాత అంబేద్కర్ స్వాభిమాని సేన జిల్లా అధ్యక్షుడు జుమన్న గుడిమని ఫిర్యాదు చేశారు. 2026 మార్చి 13న జోషికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. కార్యక్రమం ఆదివారం జరిగిందని, డ్యూటీ సమయం



తర్వాతే పాల్గొన్నానని ఆయన వివరణ ఇచ్చారు. అది రాజకీయ కార్యక్రమం కాదని, సాంస్కృతిక కార్యక్రమమని చెప్పారు. అయితే ఈ వివరణను విద్యాశాఖ తిరస్కరించింది. దేశముఖ్ విషయంలోనూ ఇదే పరిస్థితి. 2025 అక్టోబర్ 10న హునసగిలో జరిగిన ఆర్ఎస్ఎస్ పథసంచలనంలో ఆయన పాల్గొన్నట్లు శాఖ తెలిపింది. ఆయన కూడా కార్యక్రమం డ్యూటీ వేళల్లో జరగలేదని, సాంస్కృతిక కార్యక్రమమని వివరణ ఇచ్చారు. దానిని అధికారులు అంగీకరించలేదు.

## గూఢచర్యం చేస్తున్న దంపతుల అరెస్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తున్న దంపతుల్ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పోలీసులు కీలక వివరాలు రాబట్టారు. అరెస్టైన జంటను మొహమ్మద్ సాహిల్, అతడి భార్య సమీరగా గుర్తించారు. వీరి అరెస్టుకు సంబంధించిన వివరాల్ని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. సాహిల్, సమీర జంట ఢిల్లీలోని సరాయ్ కాలే ఖాన్ ప్రాంతంలో ఉంటున్నారు. సాహిల్ 2001లో ఉత్తర ప్రదేశ్‌లోని బదాయున్ ప్రాంతానికి చెందినవాడు. అతడు త్వరలో ఎల్ఎల్‌బీ చదివేందుకు ప్లాన్ చేసుకున్నాడు. 2005లో బిజ్నూర్‌కు చెందిన సమీర ఇంటర్ పూర్తి చేసింది. వీరిద్దరూ కొంతకాలంగా పాకిస్తాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ సంస్థతో కలిసి పని చేస్తున్నారు. భారతీయ నిఘా వ్యవస్థలు అందించిన సమాచారం ఆధారంగా నార్తర్న్ రేంజ్ ఆఫ్ ద స్పెషల్ సెల్ పోలీసులు ఈ దంపతుల్ని అరెస్టు చేశారు. సాహిల్ 2024 నుంచి పాకిస్తాన్ కోసం పనిచేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అక్కడి వారిని సంప్రదిస్తుంటాడు. అతడితోపాటు భార్య సమీర కూడా పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తుంటుంది. ఈ ఇద్దరికీ తగిన ఆర్థిక సాయం అందిస్తామని పాక్ ఏజెంట్లు హామీ ఇవ్వడంతో ఇద్దరూ గూఢచర్యం చేస్తున్నారు. పాక్ వారికి అనుకూలంగా ఉండేవారిని ఇంకా సభ్యులుగా చేర్పించడం, అలాగే వారికి రవాణ సదుపాయం చేయడం వంటి పనుల్ని పాక్ ఐఎస్ఐ అప్పగించింది. ఈ జంట ఇక్కడ ఎనిమిది సిమ్ కార్డులు కొని, దుబాయ్ ద్వారా పాకిస్తాన్ పంపింది. ఈ సిమ్ కార్డులకుగాను వారికి రూ.30 వేలు అందాయి. ఈ ఇండియా నెంబర్లను పాకిస్తాన్ నుంచి ఆపరేట్ చేస్తున్నారు. వీటికి సంబంధించిన వాట్సాప్ కూడా యాక్టివేట్ అయింది. ఈ నెంబర్ల ద్వారా నిఘా సంబంధిత కార్యకలాపాలు చేపడుతున్నారు. ఇండియన్ నెంబర్లతో పాకిస్తాన్ వాళ్లు అనేక ఇండియన్ వాట్సాప్ గ్రూపుల్లోకి ఎంటర్ అయ్యారు. ఇండియాలోని కంటోన్మెంట్ ప్రాంతాల్లో ఈ జంట పర్యటించి, అక్కడి సమాచారాన్ని కూడా వారికి చేరవేసింది. ఈ దంపతులకు సంబంధించిన ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ప్రస్తుతం వీరికి సంబంధించిన విచారణ కొనసాగుతోంది.

## చీరెల పంపిణీలో తొక్కిసలాట

### స్పృహ కోల్పోయిన కొందరు మహిళలు

**లక్నో,ఆగస్టు 28:** రాఖీ సందర్భంగా ఒక బీజేపీ మేయర్ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఊహించని విధంగా వేల సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. చీరల కోసం వారు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తోపులాట జరుగడంతో కొందరు మహిళలు స్పృహ కోల్పోగా చాలామంది గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. బరేలీ బీజేపీ మేయర్ ఉమేష్ గౌతమ్ రక్షాబంధన్‌కు ఒక రోజు ముందు మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం బరేలీ క్లబ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమం కోసం 20వేల మందికిపైగా మహిళలు తరలివచ్చారు.

పిల్లలు, కుటుంబంలోని వృద్ధులతో కలిసి ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. బరేలీ బీజేపీ మేయర్ ఉమేష్ గౌతమ్‌కు రాఖీలు కట్టేందుకు మహిళలకు ముందుగానే కూపన్లు పంపిణీ చేశారు. అయితే వారు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గ్రౌండ్‌లో కనీసం నిల్చోవడానికి కూడా చోటు లేనంత పరిస్థితి ఏర్పడింది. చాలా మంది మహిళలు బారికేడ్లను దాటుకుని వేదిక వైపు వెళ్లారు. తీవ్ర ఎండ, ఉక్కపోత మధ్య మహిళల సంఖ్య పెరుగడంతో పరిస్థితి అదుపుతప్పింది. మరోవైపు పంపిణీ చేస్తున్న చీరల కోసం మహిళలు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తోపులాట జరుగడంతో చాలా మంది మహిళలు స్పృహ తప్పి పడిపోయారు. పలువురు గాయపడ్డారు. స్పృహ కోల్పోయిన, గాయపడిన మహిళలను అంబులెన్స్‌లలో ఆసుపత్రులకు తరలించారు. ఈ నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయకపోవడంపై పలువురు మహిళలు మండిపడ్డారు. అయితే ఈ కార్యక్రమం గురించి తమకు ముందుగా సమాచారం ఇవ్వలేదని పోలీస్ అధికారి తెలిపారు. అలాగే తోపులాటలో మహిళలు స్పృహ కోల్పోవడం, గాయపడటం గురించి ఎలాంటి అధికారిక ఫిర్యాదు కూడా నమోదు కాలేదని చెప్పారు. కాగా, మహిళల తోపులాట, స్పృహ కోల్పోవడం, గాయపడిన సంఘటనలకు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

